



# పంజరం

పరిమళా సోమేశ్వర్

'అమ్మా!'

అమ్మ పిలుపు విని న్యూస్‌పేపర్ మీది నుండి దృష్టి మళ్ళించి తలెత్తి చూసింది కళ్ళజోడులో నుండి సీతాదేవి. ఆమె పెద్ద కూతురు కళ్యాణి తల్లి కెదురుగా ఉన్న సోఫా కానుకుని తలవంచుకుని నిలబడి ఉంది. సీతాదేవి ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న లేడీస్ కాలేజీలోనే కళ్యాణి బి. ఏ. ఫైనల్ యియరు చదువుతోంది.

'ఏమ్మా? ఏమిటి? రవి, విజయ వచ్చేరా?' అనడిగింది.

'అన్నయ్య జార్జితో కలిసి పిక్చర్‌కి వెళ్తానని చెప్పేడు. రాత్రి పదింటికి గాని రాడు. విజయ కాలేజీ నుండి యిప్పుడే వచ్చింది' అని ఆగింది—ఏదో సంశయిస్తున్నట్టు. సీతాదేవి ఆశ్చర్యపడింది కొద్దిగా. పిల్లలకి తన దగ్గర ఎంతో చనువు. కళ్యాణి ఎందుకలా సంకోచపడుతోందా అనుకుంది.

'రామ్మా రా! యిలా కూర్చో' అంది.

కళ్యాణి మెల్లగా వచ్చి తల్లి పక్కనే కూర్చుంది సోఫాలో.

'కాలేజీ పాఠాలు బాగా అర్థం అవుతున్నాయమ్మా? ఏ సబ్జక్టులో నన్నా డిఫికల్టీ ఉంటే చెప్పు. ట్యూషన్ పెట్టిస్తాను.' అంది సీతాదేవి.

పైకలా అన్నదేకాని ఆమెకి తెలుసు—కళ్యాణికి చదువులో ఏం ఢోకాలేదనీ, అవసరం వస్తే లెక్చరర్లకే చదువు చెప్పేంత చురుకైన పిల్లనీను.

'అదికాదమ్మా...' ఆ పైన చెప్పలేక పోతోంది కళ్యాణి. ఆమె కంఠం గద్గదిక మయింది.

తల్లి ఆమె భుజంమీద చెయ్యివేసి ప్రేమగా నిమురుతూ అడిగింది. 'చెప్పమ్మా. చెప్పు. నా దగ్గర నీకు భయమెందుకు?' అన్నది అనునయంగా.

'అమ్మా—నేను .. నేను జార్జిని పెళ్ళి చేసికుంటానమ్మా!' అంటూనే కళ్ళవెంబడి బొటబొట నీళ్ళు కార్చసాగింది కళ్యాణి. కూతురి భుజంమీద వేసిన సీతాదేవి చెయ్యి కొంతసేపటి వరకు చలన రహితమయింది.

రెండు నిమిషాలపాటు నిశ్శబ్దం ఆవరించిన ఆ గదిలో టేబులుమీది టైమ్‌పీస్ చప్పుడు తమ గుండె చప్పుడు తప్ప

మరేమీ వినపడలేదా తల్లీకూతుళ్ళిద్దరికీ.

కొంతసేపయినాక నిట్టూర్చి అన్నది సీతాదేవి. 'నాన్నగారిని అడిగి చూద్దాం.

ఐనా నీ పెళ్ళికి యిప్పుడే ఏం తొందరొచ్చింది? పరీక్షలింకా రెండు నెలలున్నయ్. పాఠాలు శ్రద్ధగా చదువు.'

'లేదమ్మా. ఈ నెలలో జార్జికి విజయవాడ ట్రాన్స్‌ఫరవుతుందనుకుంటున్నారు. కనుక ఏ సంగతీ ముందు తేల్చుకుంటే మంచిదని మా ఉద్దేశ్యం. అన్నయ్య కూడా అలాగే అన్నాడు.'

'ఐతే రవికి తెలుసన్నమాట యీ సంగతి!'

'నీకు తెలియనిదేముందమ్మా.? వాళ్ళిద్దరూ కాలేజీ రోజుల నుండి ఎంతో ప్రాణస్నేహితులు పైగా జార్జితో నాకు పరిచయమయింది అన్నయ్యవల్లనే కదా' అంది కళ్యాణి. కాసేపు మౌనంగా కూర్చుండిపోయింది సీతాదేవి ఏదో ఆలోచిస్తూ.

తరువాత 'ఇంక నువ్వెళ్ళి 'టీ' తీసుకో' అన్నది.

కళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపోయింది కళ్యాణి.

కూతురు వెళ్ళిపోయాక ఐదునిమిషాల వరకు అక్కడే కూర్చుండిపోయింది సీతాదేవి. తరువాత పేపరు మడిచి టేబుల్ మీద పడేసి, కళ్ళజోడుతీసి కేసులో పెట్టి డ్రాయరులో వుంచి యింటి వెలుపల గార్డెన్ లోకి వెళ్ళింది. మనసు బాగుండనప్పుడల్లా అలా గార్డెన్‌లో తిరుగుతూ ఆలోచిస్తూ 'రిలీఫ్'ని పొందుతుంటుందామె. ఆ తోటలోని ప్రతి మొక్కా ఆమె స్వయంగా తన చేత్తో నాటినదే. ఒక్కొక్క మొక్కనే చేత్తో మృదువుగా తాకుతూ మల్లె పందిరి వద్దకు వెళ్ళింది. ఈయేటి మల్లెపూత అప్పుడే ప్రారంభమయింది. సగం విచ్చుకున్న మల్లెపూలు గుప్పుమంటూ సువాసనలు వెదజల్లుతున్నయ్.

ఆ మధుర సౌరభాన్ని ఆస్వాదిస్తూనే సీతాదేవి శరీరంలో పులకరింత కలిగింది. ఏభయ్యో పడిలోకి ప్రవేశించిన ఆమె హృదయవీణ మెల్లగా తీగలు సవరించుకుంది. ఆమె కంఠంలో అస్పష్ట రాగాలేవో కదలసాగినయ్. ఆమె కన్నులలో కాలంతో పాటు కరిగిపోయిన కల లోక రూపాన్ని తెచ్చుకుంటున్నయ్. కొద్ది క్షణాల్లో ఆమె ఇరవై సంవత్సరాల ముగ్ధగా మారిపోయింది.

ఆమె మెదడు గతంలోకి పయనిస్తోంది. ఆ రోజు తను కూడా కళ్యాణిలా అమ్మ వద్దకు వెళ్ళి ఏడ్చింది. 'నేను బావని పెళ్ళి చేసికోనమ్మా. వేణు తప్ప మరో పురుషుడి స్పర్శని భరించలే' నంటూ ఎంతగానో బతిమాలుతూ చెప్పింది.

కాని అమ్మ వినిపించుకోలేదు. 'చూస్తూ చూస్తూ ఆ కులహీనుడికిచ్చి చేసే బదులు నిన్ను బావిలో పడేసి చంపనైనా చంపుతాం కాని వంశ గౌరవాన్ని మాత్రం నాశనం చేసికోలేం' అంటూ కఠినంగా సమాధానమిచ్చింది.

'అయితే మీరు కనుక బావకిచ్చి నన్ను చేసేరంటే నేను నిజంగానే బావిలో దూకి చస్తా' నంది తను రోషంగా.

'నువ్వు చచ్చినా పరవాలేదే. ఆ శవాన్నే నా మేనల్లుడికిచ్చి చేస్తా' నన్నాడు నాన్న గర్జిస్తూ.

అనటమే కాదు, తను చావకుండా ఎన్నో విధాల కట్టుళ్ళు చేసేడు. ఒకసారి ఎలాగో తప్పించుకుని బావిలోకి దూకపోతుంటే నాన్న చూసి రెక్క పట్టుకు లాక్కొచ్చి గదిలో పడేసి చావ బాదేడు. ఇక ఆ తరువాత చచ్చినా తను చావలేదని ఎలాగో మనసు రాయి చేసికొని పరిస్థితులకు తల వంచింది.

పెళ్ళిలో అమ్మలక్కలందరూ 'ఏమిటి పెళ్ళికూతు రిలా దిగాలుపడి ఉంది' అనడిగితే అమ్మ 'ఎం. ఏ. పరీక్షలు వ్రాసింది యేడే. ఎంతో కష్టపడి ఫస్టుక్లాసు కోసం చదివితే చివరకు సెకండ్‌క్లాసే వచ్చిందని దిగులుపెట్టు కూర్చుంది' అంది ఏ మాత్రం జంకకుండా.

జీవితంలో మొదటిసారిగా విషపు నవ్వు నవ్వుకుంది తను. ఆ రోజునుండే తనకి మనిషికీ మనిషికీ మధ్యగల మమకారాలన్నా, అనుబంధాలన్నా అసహ్యం, విరక్తి పుట్టినయ్. పిల్లలు తల్లిదండ్రులను అసహ్యించుకునే క్షణాలు కూడా ఉంటాయని ఆ రోజే మొదటిసారిగా తెలిసింది.

తల్లిదండ్రులు పిల్లలని ప్రేమిస్తారు. కాని అర్థం చేసికోలేరు. దానికి కారణం రెండు తరాల మధ్య ఎన్నటికీ పూడని అగాధం ఉండటమే.

తమ పిల్లల శారీరకారోగ్యం కోసం ఎంతో శ్రద్ధ తీసుకునే తల్లిదండ్రులు వారి ఆత్మానందాన్ని గురించి ఎందుకాలోచించరో ఎంతకీ తన కర్థంకాదు.'

గణగణ మన్న గంట శబ్దం విని ఉలిక్కిపడి ఆలోచనలనుండి తేరుకుంది సీతాదేవి. తన భర్త సాయంపూజ ముగిసి ఉంటుందని ఊహించి చిన్నగా నిట్టూర్పు విడిచింది.

రిటైర్డు జడ్జి అయిన తన భర్త పూజ చేయనిదే పచ్చి మంచినీళ్ళయినా ముట్టుకోడు. మొదటినుండీ తన స్వభావం విగ్రహారాధనకి పూర్తి వ్యతిరేకం. స్వర్గంలోనే పెళ్ళిళ్ళు జరిగినట్లయితే రెండు విరుద్ధ ప్రకృతులు గల స్త్రీ పురుషులను బలాత్కారంగా ఎందుకు కల్పుతాడో దేవుడు! నవ్వుకుంది సీతాదేవి.

ఆమె లోపలికి వెళ్ళగానే అప్పుడే ఆమె భర్త—భరతశర్మ పూజ గదినుండి బయటకు వస్తున్నాడు.

ఆమెని చూడగానే 'సీతా! పూజయింది. పిల్లలను హారతి కళ్ళ కద్దుకుని ప్రసాదం తీసుకోమని చెప్పు' అన్నాడు.

ఆమె మౌనంగా లోపలికి నడిచింది

వెళ్తూ ఒకసారి వెనక్కి తిరిగి చూసింది. మెల్లగా నడుస్తూ లైబ్రరీ గదిలోకి వెళ్తున్న భర్త స్థూలకాయం కొద్దిగా కనపడింది. చిత్రంగా అనిపించిందామెకు.

'ఈ మనిషిని తనెన్నడైనా ప్రేమించిందా?' ఏ హిందూ స్త్రీ కూడా వెయ్యకూడని ప్రశ్నవేసుకొంటోందని ఆమెకి తెలుసు కాని ఆమె లోని 'హిందూత్వం' 'స్త్రీ'త్వానికే ఎక్కువ ప్రాధాన్యానిస్తోంది. ఈ స్త్రీ జాతిమతకాలాతీతమైనదని ఆమె ఉద్దేశ్యం.

భర్తగా అతనిని మన్నించింది తప్ప ఒక పురుషుడిగా అతని నెన్నడూ ఆరాధించలేదు ఆమెలోని యీ 'స్త్రీ' పైగా ఆయన నేవగించుకున్న క్షణాలనేకం.

అలా భర్తని అసహ్యించుకుంటున్నందుకు ఎన్నోసార్లు తనని తాను నిందించుకుంది. ఒకటి, రెండుసార్లు ప్రాయశ్చిత్తంగా పచ్చి మంచినీళ్ళయినా ముట్టకుండా కఠినమైన ఉపవాసం చేసింది.

శరీరాన్ని కృశింపజేస్తే తాత్కాలికో

# పంజరం

ప్రేశాలు వల్లారవచ్చు. కాని ఆకలి చావదు: అందుకే ఆ తరువాత అలాటి ప్రయత్నాలు విరమించింది.

ఆమెకి హృదయం ఉంది. లోకజ్ఞానం ఉంది. అందుకే భర్తముందు తలవంచ గలిగింది. కాని అనవరతం ఆమెలో జాగృతమై ఉండే మేధస్సుకు అతనిలోని లోపాలు సుస్పష్టంగా కనపడటంతో అతనిని లోలోపల అసహ్యించుకుంది. ఒక్కోసారి తిరస్కరించింది కూడా.

కాని చిత్రం. అదేవ్యక్తితో ముప్ఫై సంవత్సరాలుగా కాపురంచేస్తోంది తను! సినికల్‌గా నవ్వుకుంది సీతాదేవి.

'మమ్మీ! డాడీ పూజయిందా?' అంటూ వచ్చిందామె రెండోకూతురు విజయ.

విజయ మెడిసిన్ థర్డియర్‌లో ఉంది. చిన్నతనంనుండి కాన్వెంటులో చదవటం వలన ఆమె వేషభాషల్లో పాశ్చాత్యానుకరణ కొట్టవచ్చినట్లు కనపడుతుంది. అది సీతాదేవి కిష్టంలేదు. ఐనా ఎప్పుడూ కూతురుని మందలించలేదామె. స్వతంత్రంగా ఆలోచించే వయసువచ్చిన పిల్లలపై ఆంక్షలు విధించకూడదని ఆమె మతం.

'ఆఁ పూజయింది. ప్రసాదం తీసుకోండి' అని ఆ రోజు ఏమేం పదార్థాలు వండాలో వంటమనిషికి చెప్పటానికి వెళ్ళిపోయింది సీతాదేవి.

ఆమె ప్రసాదం తినదు. ఈ విషయంలో ఆమెకి, భర్తకి చాలాసార్లు వాగ్వివాదాలు జరిగినయ్. ఇరవై సంవత్సరాలు లాయరుగా, ఆ పైన ఎనిమిది సంవత్సరాలు జడ్జిగా ఎంతో విజయవంతంగా వెలిగిన భరతశర్మ భార్యని యీ విషయమై తన వాదనతో ఒప్పించలేక పోయేడు. 'పరిపూర్ణమైన మానవత్వమే నా ధ్యేయం. మానవత్వాన్నారాధించే నాకు మట్టిబొమ్మల పైని భక్తి భావాన్ని పుట్టించటానికి మీరు ప్రయత్నించటం వృధా ప్రయాస' అంటుంది సీతాదేవి.

రాత్రి తొమ్మిది గంటలయింది. భోజనాలకి యింట్లోని వారంతా డైనింగ్ టేబుల్ చుట్టూ కూర్చున్నారు. వంటమనిషి వడ్డిస్తోంది. భరతశర్మ నోటితో పెద్దగా చప్పుడుచేస్తూ భోజనం చేస్తుంటే ముప్ఫై సంవత్సరాలు అతనితో కాపురం చేసినా యింకా దానికలవాటు పడని సీతాదేవి అతని పక్కనే ఉన్న కుర్చీలో యిబ్బందిగా కూర్చుంది. ఆమె రాత్రిళ్లు భోజనం చెయ్యదు. నాలుగేళ్లగా ఆమె ఒంటిపూట భోజనమే అలవాటు చేసికొంది. అందరి భోజనాలు అయినాక రాత్రి పడుకోబోయే ముందు గ్లాసెడు పాలు తాగుతుంది.

తను తినకపోయినా పిల్లలంతా సరీగా భోజనాలు చేస్తున్నారో లేదో చూడటానికి వారితోపాటే కూర్చుంటుందామె. భరతశర్మకి బ్లడ్‌ప్రెషర్ ఎక్కువగా ఉందని డాక్టరు రాత్రి భోజనం మానమని చెప్పేడు. ఐనా ఆయన భోజన ప్రియుడవటం వలన ముందు తిని తరువాత మందులన్నా తాగుతాడుకాని సుష్టుగా రెండుపూట్లా భోంచెయ్యందే ఊరుకోడు. వయసు మళ్ళుతున్న కొద్దీ ఆయనకి జిహ్వాచాపల్యం కూడా ఎక్కువవుతోంది.

'రవి భోజనానికి రాలేదేం?' అనడిగేడు భరతశర్మ చపాతీముక్క నోట్లో పెట్టుకుంటూ.

'పిక్చర్‌కి వెళ్ళేడు' తకీమని జవాబిచ్చింది.

'వీడికి సినిమా పిచ్చి బాగా పట్టుకుంది. జార్జిగాడి స్నేహంచేసి మరీ చెడిపోతున్నాడు. పైగా ఏమన్నా అంటే ఉద్యోగమ్మిస్తున్నాయా నా కేమిటంటాడు.'

అందరూ నిశ్శబ్దంగా కూర్చున్నారు.

ఆయనకి కోపం వచ్చినప్పుడు గట్టిగా ఊపిరి పీల్చటానికి కూడా భయపడతారా యింట్లో—ఒక్క రవి తప్ప.

'ఈ కాలం పిల్లలే అంత. పట్టి కృతఘ్నులు. కని, పెంచి కష్టపడి పైకి తీసుకువస్తే రెక్కలొచ్చేయికదా అని ఎగిరిపోవటం తప్ప వెనక్కి తిరిగి చూడటంలేదు.'

ఉద్రేకంతో అతని ముఖం ఎర్రబడింది.

కళ్యాణి తలవంచుకు తింటున్నదల్లా తలెత్తి తల్లి వంక చూసింది.

ఆమె కళ్లలోని భావాన్ని గ్రహించిన సీతాదేవి మాట్లాడకుండా తల తిప్పేసుకుంది.

భర్త మాటలు వింటుంటే ఆమెకి ఆవేశం వచ్చింది.

'వాళ్ళెందుకు వెనక్కి తిరిగి చూడాలి? కాలం ఎప్పుడూ ముందుకే నడుస్తుంది కాని వెనక్కి రాదు. అలాగే కాలప్రవాహంతో పాటు పురోగమించే యువతరాన్ని వెనక్కి తిరిగి చూడమనటంలో అర్థంలేదు కని పెంచినంత మాత్రాన తల్లిదండ్రులకు తమ పిల్లలపై సర్వాధికారాలున్నాయనుకోవటం తెలివి హీనం. పిల్లల్ని కనటమనేది సృష్టిలోని అతిసహజమైన కార్యం. దానికి ఏ మనిషీ గర్వపడ నవసరంలేదు. అలాగే పుట్టిన పిల్లలను పెంచటం పశుపక్ష్యాదులలోకూడా ఉంది. అది మానవుడి ప్రత్యేకతేం కాదు. స్వయంపోషకశక్తివచ్చిన పిల్లలు తల్లిదండ్రులకు దూరమవటం కూడా అతి సామాన్యమైన విషయం. దీనికెందు కింత రాద్ధాంతంచేస్తారో అర్థంకాదు. అలాగని పిల్లలు తలిదండ్రుల నెదిరించాలని కాదు. తమభావాల కనుగుణంగా తమ జీవితాల్ని మలచుకోవటంలో తప్పేంలేదు' అనుకుంది సీతాదేవి.

కాని ఎదిగిన పిల్లల ఎదుట భర్తతో అంత ఘాటుగా మాట్లాడటం యిష్టంలేక ఊరుకుంది.

భరతశర్మ ఉద్రేకంతో జార్జి మతాన్ని దుయ్యబడుతూనే ఉన్నాడు.

రామునీ, రహీంను, భగవద్గీతనీ, బైబిలునీ సమానంగా మన్నించే సీతాదేవి సిగ్గుతో, బాధతో తల వంచుకుంది.

ఆమె కళ్యాణి వంక చూసింది. ట్యూబ్ లైట్ వెలుగులో ఆమె కళ్లలో తళ తళ మెరుస్తున్న నీటిని చూసి నిస్సహాయంగా నిట్టూర్చింది.

ప్రతిసారి భర్త అలా ఉద్రేకంగా ఏమయినా మాట్లాడుతుంటే గుండెపోటు వస్తుందని వారించేది. కాని యీ రోజామెకా ధ్యాసే లేదు. ఆమె భావనా ప్రపంచంలో ఒంటరిగా విహరిస్తోంది. అక్కడ తనే—తనొక్కతే ఉంది. భర్త, పిల్లలు, ఉద్యోగం ఎవరూ లేరు. వాళ్ళ అవసరం కూడా లేదామెకి.

రెండు నెలలు గడిచినయ్. పిల్లలందరికీ పరీక్షలయిపోయినయ్. కాలేజీకి సెలవులవటంవలన సీతాదేవికి పని ఒత్తిడి తగ్గింది. ఆ రోజు మధ్యాహ్నం మూడు

గంటలవేళ యింట్లో అంతా వేసవి తాపానికి తట్టుకోలేక నిద్రపోతుంటే సీతాదేవి వస్త్రాతం పట్టివేళ్లతో బంధించి ఉన్న కిటికీలు, ద్వారబంధంగల గదిలో కూర్చుని టాల్‌స్టాయ్ 'రిసరక్షన్' నవల చదువు తోంది. కథాంతంలో కథానాయకుడు మనుష్యులు, అర్థంలేని మమకారాలు, అనుబంధాలు — వీటన్నిటినీ తెంచుకుని చివరకు మానవుని విజ్ఞానక్షే స్నేహితుడు అతని ఆత్మే అని తెలుసు కుంటాడు. ఆ ఆత్మతో సంభాషించాలంటే ఆధ్యాత్మిక చింతన, పవిత్రగ్రంథపఠనం అవ



కారం. అందుకే అతను బైబిల్ తీసేడు. ఒకప్పుడు బైబిల్‌లోని ఏ వాక్యాలనైతే అర్థహీనంగా చాదస్తంగా తీసి పారేసేడో, ఆ వాక్యాలు అప్పటి అతని మానసిక స్థితిలో కొత్త అర్థంతో, నవచైతన్యంతో కనిపిస్తాయి.

'మానవుడెప్పుడైతే అహంకారాన్ని చంపుకుని ఎదుటి మనిషిలో దైవాన్ని చూడగల్గుతాడో అప్పుడే అతని అసలు జీవితం ప్రారంభమవుతుంది. ఆత్మసాక్షాత్కారం చేసికొన్న మనిషి సశరీరుడైనా రాగద్వేషాలకతీతుడు.' అనుకుంది సీతాదేవి.

ఏదో అలికిడైనట్లయి 'ఎవరది?' అంది.

సమాధానంలేదు. ఎవరో గబగబ నడచి వెళ్తున్నట్లు అడుగుల చప్పుడు వినిపించింది.

మెల్లగా లేచి కిటికీకున్న తెర తొలగించి చూసింది సీతాదేవి.

జార్జి, కళ్యాణి ఇంట్లోనుంచి వీధిగేటు వైపుకు వెళ్తున్నారు. గేటు దగ్గరకి వెళ్ళగానే జార్జి కళ్యాణి చేతిని తన చేతిలోకి తీసుకుని పెదవులతో స్పృశించేడు. ఆమె వంక చూసి నవ్వుతూ ఏదో అన్నాడు. కళ్యాణి ముఖం పక్కకి తిప్పి నవ్వుకుంది. ఆమె బుగ్గమీద చిటికవేసి నవ్వుతూ వెళ్ళిపోయేడు జార్జి. కళ్యాణి అక్కడే రెండు నిమిషాల వరకు అతను వెళ్ళిన వంకే చూస్తూ నిలబడింది. చివరకు గేటుమూసి వెనక్కి రాబోతుంటే సీతాదేవి కర్టెన్ క్రిందికిలాగి లోపలికి వచ్చేసింది.

ఆరోజు మరో కొత్త విషయం తెలిసింది సీతాదేవికి. జార్జి అంత దొంగతనంగా కళ్యాణిని కలుసుకోవలసిన ఆగత్యం ఎందుకు పట్టింది? కళ్యాణికే గనుక తగిన స్వేచ్ఛాస్వాతంత్ర్యాలున్నట్లయితే జార్జి వచ్చి సూటిగా తమ అనుమతి తీసుకుని కళ్యాణితో మాట్లాడేవాడుకదా.

పెద్దవాళ్ళ చేతుల్లో పిల్లల మనస్తత్వాన్ని ఎలా పాడుచేస్తారో తెలిసి వచ్చిందామెకు.

ఎలాగైనా యిక జాప్యం చెయ్యకుండా భర్తతో యీ విషయం చెప్పాలనుకుంది.

సాయంత్రం టిఫిన్లయినాక భార్యాభర్తలిద్దరూ గార్డెనులో కుర్చీలేసుకుని కూర్చుం

# పంజరం

డగా సీతాదేవి యీ విషయం కదిపింది.

'కళ్యాణి పెళ్లి విషయమై ఏమనుకుంటున్నారు? అంది.

'ఇప్పుడు కొత్తగా అనుకోటానికేముంది? ఆ కలెక్టరుగారబ్బాయిదే ఖాయం చేద్దామనుకుంటున్నా. అతను రిసెర్చి చెయ్యటానికి వచ్చే ఆగస్టులో అమెరికా వెళ్తాడట. ఈలోగానే పెళ్లి చేద్దామని వాళ్ల ఉద్దేశ్యం. కళ్యాణి వాళ్ళందరికీ నచ్చింది. కావాలంటే పెళ్ళయినాక వాళ్ళే చదివించుకుంటారు పిల్లని' అన్నాడు భరతశర్మ.

కొంచెం ఆగి అంది సీతాదేవి 'మరి కళ్యాణి యిష్టం సంగతి కనుక్కోనవద్దా?' అని

'ఆ రామమూర్తికేం అందం, చదువు, డబ్బు — అన్ని లక్షణాలూ ఉన్నాయ్. కళ్యాణేకాదు. ఏ ఆడపిల్లా అతన్ని చేసికోను అనలేదు. ఏం ఎందుకలా అడుగుతున్నావ్? అదేమయినా చెప్పిందా నీతో?'

తన్నుతాను సంబాళించుకుని మెల్లగా జవాబిచ్చింది 'కళ్యాణి జార్జిని చేసికొంటానంటోంది'

'ఎవరిని?...జార్జినా!!'

ఆ క్షణంలో భర్త ముఖంలో వ్యక్తమయిన భావాలను చూడలేక తల తిప్పేసుకుంటూ కొంచెం కఠినంగా అంది 'ఔను. జార్జిని తప్ప మరెవరినీ చేసికోనంటోంది.'

'నేను మొదట్నుంచీ అనుకుంటూనే ఉన్నాను—వీళ్లను నమ్మకూడదని. ఏదో చదువుకున్న వాడుకదా అని మన వాళ్లని వాడితో తిరగనిస్తే చివరికి యింతపని చేస్తాడా? ఈ సారి మనింటి గడపతొక్కనీ కాళ్ళు విరగ్గొట్టి పంపిస్తా' నన్నాడు క్రోధంగా.

'అతని కాళ్ళు విరగ్గొట్టటం చాలా తేలికేగాని మనమ్మాయి మనసు మళ్లించటం అంత సులభమైన విషయంకాదు.ఆ సంగతి మర్చిపోకండి' అంది సీతాదేవి.

'ఐనా రామమూర్తి జార్జికి ఏ విషయంలో తీసిపోయేడని? అందంలో, అంతస్తులో అన్ని విధాలా రామమూర్తి ముందు ఎందుకూ పనికిరాడు జార్జి. ఏవో నాల్రోజులు కలసిమెలసి తిర్గినంతమాత్రాన 'ప్రేమ' అనే భ్రమలో పడుతున్నారు యీ కాలం పిల్లలు. పెళ్లి చేస్తే సరి కళ్యాణి మనసు దానంతటదే దారికి వస్తుంది.'

సీతాదేవిలో సహనం నశించిపోయింది.

'అందంతో అంతస్తులతో మనుష్యుల మనసులు కట్టేద్దామనుకోవటం వట్టి తెలివి తక్కువ. వాళ్లనుకునే ప్రేమ నిజంగా భ్రమే అయినట్లయితే మంటలో పడిన శలభాల్లా వాళ్ళనా భ్రమలోనే పడి చావనీయండి. అంతే కాని మీ అభిప్రాయాలకీ, అహంభావానికి ఆ పసి మనసులను బలి చెయ్యకండి' అంది ఆవేశంగా సీతాదేవి.

భరతశర్మ విస్తుపోయేడు.

తన భార్యలో అంతటి ఆవేశం, వాగ్ధాటి ఉన్నాయని అతని కంతకు ముందు తెలియదు!

మెల్లగా రాజీపడే ధోరణిలో అన్నాడు. 'అది కాదు సీతా! కళ్యాణికి రామమూర్తి నచ్చకపోతే మన కులంవాడినే మరొకడిని చేసికోమను. అంతే కాని చూస్తూ చూస్తూ కూతుర్ని ఓ మతాంతరుడికివ్వమంటే ఎలా చెప్పు?' అన్నాడు.

'చదువు, లోకానుభవం అన్నీ వున్న మీరే యిలా కుల మత భేదాలను పాటిస్తుంటే యింక ఏం చెప్పేది?' అంది సీతాదేవి.

'ప్రతి మనిషీ తన జాతిని గౌరవించుకోవటంతో తన్ను తాను గౌరవించుకుంటాడు సీతా! మన సనాతన ధర్మమేదీ ఒక మతమూ కాదు, యీ నాటిదీ కాదు. యుగ యుగాలుగా చెక్కు చెదరక నిల్చిన మానవజాతి సంస్కృతినే సనాతన ధర్మమంటారు. అలాటి సంస్కృతిని, ధర్మాన్ని వదులుకొని జాతి భ్రష్టులవటం కంటె తెలివిహీనత మరొకటుండదు.'

'మీరు సంస్కృతి అని దేని నంటున్నారో అది తరతరాలుగా వస్తున్న ఆచార వ్యవహారాలు మాత్రమే. సంవత్సరాల తరబడిగా వస్తున్న అలవాట్లు కాబట్టి అవి తప్పక ఆచరణీయమనటం హేతుబద్ధంగా లేదు. మరోకులంవాడినికాని, మరో మతస్థుడిని కాని వివాహమాడినంతమాత్రాన జాతి భ్రష్టత కలుగుతున్నపుడు ఆజాతి సంస్కృతి

ఉంటేనే, వశిస్తేనేం? సర్వమతాలపారమే హిందూమతమని, నదులన్నీ సముద్రంలో కలిసినట్లు అన్నిమతాలు వాటివాటి ఉత్కృష్ట స్థాయిలో హిందూ మతంలో లీనమైపోతాయని విదేశాల్లో ఎలుగెత్తి చాటుతారే. మరి ఆచరణలోకి వచ్చేసరికి ఆ నినాదాలన్నీ ఏమైపోతయ్? నీ తల్లి గడ్డమీద నీతోపాటు పుట్టి పెరిగిన ఒక మనిషిని గౌరవించలేని నీ సంస్కృతి ఏపాటిది?'

'కొందరు మనదేశంలో పుట్టినా, మన సనాతన ధర్మాన్ననుసరించటంలేదు. ఆసంగతి మర్చిపోకు'

'దానికి కారణం మీరే. కడజాతివాళ్లంటూ కొన్ని కులాలను మీరు ఎప్పుడైతే హీనంగా చూసేరో అప్పుడు వాళ్లకి మీ మతమన్నా, సంస్కృతన్నా అసహ్యం, విరక్తి పుట్టినయ్. అందుకే ఏమతంలో తరతమ బేధాలుండవో, ఏమతంలో తమవ్యక్తిత్వం కించపడదో ఆ మతాన్నే అంగీకరించేరు వాళ్లు. అంతకన్న గత్యంతరం లేకపోయింది. కని పెంచిన తల్లిదండ్రులే ఒకమాట జారితే వ్యక్తిత్వంగల బిడ్డలు ఎదురు తిరుగుతారే అలాటప్పుడు కొన్నిశతాబ్దాలుగా అణగదొక్కబడిన జాతి మేల్కొందంటే ఆశ్చర్యం లేదు' అంది సీతాదేవి.

భరతశర్మ మౌనంగా కూర్చుండిపోయాడు.

అతనింక భార్యతో వాదించలేనని నిర్ధారణకి వచ్చేసేడు. అతని మెదడులో రకరకాల భావాలు మెదుల్తున్నాయ్. భార్యలో అంతకుముందెన్నడూ చూడని ఒక "వ్యక్తి" యీ రోజతని ఎదుట నిలబడి ఉంది. ఆ వ్యక్తి తనకి పరిచయమైనదీ కాదు; కనీసం భావనా ప్రపంచంలోకూడా ఆమెనెన్నడూ చూసి ఉండలేదు.

ఉన్నట్టుండి భరతశర్మలో ఏదో అలజడి ప్రారంభమయింది. తన భార్యకి తను తగిన వాడు కాడేమోనన్న ఆలోచన స్ఫురించింది. అలా అనుకోగానే వెంటనే అతనికి లోకమంతా శూన్యమైనట్లు తోచింది.

'సీతా! నీలోని 'అగ్ని'ని యీ రోజు చూడగలుగుతున్నాను.' అని గొణుక్కున్నాడు తనలో.

సీతాదేవి మనస్థితి కూడా చిత్రంగా ఉంది. ఆమె ఎన్నడూ తన భావాలని భర్త ముందు యిలా వెలిబుచ్చలేదు. ఇప్పుడిలాటి సందర్భం వచ్చిందంటే అది కళ్యాణి మూలంగానే.

సీతాదేవి పిల్లలందరిని సమానంగా ప్రేమించినా, తనకి తెలియకుండానే లోలోపల కళ్యాణిపై ఎక్కువ పక్షపాతం చూపుతూ వచ్చింది. దానికి కారణం కళ్యాణిలో ఆమె తన ప్రతిబింబాన్ని చూసుకోవటమే.

కళ్యాణి రూపం, ఆమె ఆలోచన అన్నీ తల్లి పోలికే. తల్లి లాగానే ఎంత తెలివైనదో అంత మెత్తని మనసు. ఎంత ధైర్యవంతురాలో అంత సెన్సిటివ్. చదువులో చురుకుదనం, దృక్పథంలో నిర్మొహమాటంగా... వైశాల్యం, భావాల్లోని నిండుదనం అన్నీ తల్లి గుణాలే. అందుకే కళ్యాణి కోరినదల్లా చేస్తుంది సీతాదేవి.

కూతురు కొంచెం బాధపడితే తన ఆత్మే పరితపిస్తున్నట్లుగా ఫీలవుతుందామె. తన ఆశయాలకు, ఆనందానికి విరుద్ధంగా తలిదండ్రులు తనని వివాహ బంధమనే పంజరంలో బిగించేరు. తన శరీరం, మనసు పరాధీనమై పోయినయ్ తన యిష్టంతో ప్రమేయం లేకుండా. కాని తన ఆత్మని మాత్రం యీ బంధాలన్నిటికీ అతీతంగా కాపాడుకుంటూ వస్తోంది యింతకాలం. ఇప్పుడు చూస్తూ చూస్తూ తన ఆత్మ ప్రతిరూపమైన కళ్యాణిని చేజేతులా మరో పంజరంలో బిగించలేదు. కళ్యాణికి స్వేచ్ఛనివ్వాలి. ఆమె కోసం తన చివరి రక్తబిందువు వరకు ధారపోయటానికి సిద్ధమే ననుకుంది సీతాదేవి.

భరత శర్మ తలెత్తి చూసేడు.

పూలమొక్కల మధ్య నిలబడిన సీతాదేవి సంధ్యారుణకాంతిలో అగ్నిశిఖలా వెలిగిపోతోంది. ఆ అపూర్వదృశ్యాన్ని చూస్తూ అతని కళ్లు చెదిరినట్లనిపించింది.

ఇక అక్కడ నిలబడలేకపోయింది సీతాదేవి. గబగబ నడచి లోపలికి వెళ్ళిపోయింది.

'సీతా!' అంటూ పిలిచేడు భరతశర్మ. ఆ కంఠంలోని జీర విని ఉలికిపడి వెనుదిరిగింది సీతాదేవి.

'కళ్యాణి నొకసారిలా పంపు' అన్నాడు.

భర్తవైపు మరోసారి చూసి లోపలికి నడచిపోయింది సీతాదేవి.

ఐదు నిముషాలు గడచినాక కళ్యాణి మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చింది తండ్రి దగ్గరికి.

'కూర్చో' అన్నాడు ముభావంగా భరతశర్మ.

తల్లి లేచి వెళ్ళిన కుర్చీలో భయ...



'తమర్రు సమ్మతివ్వడానికి బహుతక్కువ ఫీజు తీసుకొంటారు -అని విని వచ్చాసార్!

వేడుతూ ఒదిగి కూర్చుంది కళ్యాణి.

తలవంచుకుని వినయంగా కూర్చున్న కూతురిని చూడగానే భరతశర్మ హృదయంలో వాత్సల్యం తొణికిసలాడింది. కాని వెంటనే ఆమెని పిలిపించిన పని గుర్తుకు వచ్చి కఠినమయిందతని హృదయం.

'నువ్వు జార్జిని పెళ్ళిచేసికొంటానన్నావుటగా' అన్నాడు.

అంత సూటియైన ప్రశ్నను ఎదుర్కోవలసివస్తుందని ఊహించలేని కళ్యాణి తత్తరపడింది. ఏం మాట్లాడాలో తెలియక గుడ్ల నీళ్ళు కక్కుకుంటూ కూర్చుంది.

'నేను ఒకప్రశ్న అడిగితేనే సమాధానం చెప్పలేని నువ్వు అందరినీ ఎదిరించి మతాంతర వివాహం చేసికోగలననుకుంటున్నావా?' అన్నాడు. అతనికే తెలియని ఏదో కసి అతని కంఠంలో ధ్వనించింది.

అలా తండ్రి తన వ్యక్తిత్వం మీదనే దెబ్బతీయటంతో కళ్యాణిలోని అహం మేల్కొంది.

'ఔను. జార్జిని పెళ్ళిచేసికొంటాను' అంది మొండి ధైర్యంతో.

'అప్పుడు దాని పరిణామాలెలా ఉంటాయో ఆలోచించావా?'

'ఆలోచించేను. మీరు మళ్ళీ యీ యింట్లో కాలుపెట్టనీరు' ప్రశాంతంగా సమాధానమిచ్చింది కళ్యాణి.

'నీ స్వార్థం నువ్వు చూసుకుంటున్నావు కాని నా పరువుప్రతిష్ఠల సంగతి ఆలోచించేవా? ఫలానా ఆయన కూతురు ఎవరితోనో లేచిపోయిందని నలుగురూ వేలెత్తి చూపుతుంటే నేను ఎలా తలెత్తుకు తిరిగేది?'

'పరువు ప్రతిష్ఠలకి భంగం వాటిల్లే పనులు వేరే ఉన్నయ్ నాన్నగారూ! కూతురు మతాంతర వివాహం చేసికొన్నంతమాత్రాన పరువు పోయిందనుకుంటే మీరనుకునేది — క్షమించండి — నిజమైన గౌరవం కాదు. మేము చేసికోబోయే వివాహం తల్లిదండ్రుల అంగీకారం లేదన్న కారణంచేత లోక దృష్టిలో లేచిపోవమే అయితే ఆ నింద రాకుండా స్వయంగా మీరే ఆ వివాహాన్ని జరిపించండి!' అంది కళ్యాణి. భరతశర్మ అదిరిపడ్డాడు. తను 'కూతురికి మతాంతర వివాహం చెయ్యటమా!

తరతరాలుగా అతని రక్తంలో జీర్ణించుకు పోయిన నమ్మకాలు, సిద్ధాంతాలు కలతపడసాగినయ్. అతను నేర్చిన చదువు, అది నేర్పిన సంస్కారం; వయసుతో వచ్చిన వివేకం అన్నీ అహంకారంలో పడి తునాతునకలైనయ్.

'ఛీ! నువ్వు నా కూతురువేకాదే. ఉల్లిగడ్డ కూడా ముట్టని కుటుంబంలో పుట్టిన నువ్వు ఆ మ్లేచ్ఛుణ్ణి చేసికొని పచ్చి మాంసం తింటావుటే పాపిష్ఠిదానా!' అన్నాడు గట్టిగా గొంతు చించుకుంటూ.

దెబ్బతిన్న సింహంలా లేచి నిల్చుంది కళ్యాణి.

'ఆహారనియమాలు మనిషిపుట్టి పెరిగిన పరిస్థితులపై ఆధారపడి ఉంటయ్ నాన్నగారూ! నన్ను చేసికొన్నంత మాత్రాన తన ఆహారపద్ధతులలో మార్పు తెచ్చుకోమని అడిగేంత తెలివితక్కువదాన్ని కాను నేను. అలాగే నేసహ్యించుకునే పదార్థాలను బలవంతాన నాచేత తినిపించేంత మూర్ఖుడు కాడు జార్జి. ఐనా యివన్నీ మా స్వవిషయాలు. ఇంత చిన్న సంగతినికూడా మీకు వివరించవలసి వచ్చినందుకు సిగ్గుపడుతున్నాను' అని సమాధానంకోసం కూడా చూడకుండా చరచరా నడచి వెళ్ళిపోయింది.

భరతశర్మ మరోసారి ఓడిపోయేడు.

తను కలలోకూడా చేరుకోలేని శిఖరాగ్రాలను భార్యతోపాటు కూతురు కూడా అనాయాసంగా చేరుకోగలిగిందన్న ఆలోచన తట్టగానే అతనిలో సన్నని అసూయరేఖ ఏదో మెదిలింది. కాని వెంటనే ఆభావాన్ని అణచిపెట్టి 'చూస్తా: ఎలా జరుగుతుందో యీ పెళ్ళి' అనుకున్నాడు పళ్ళు పటపటలాడిస్తూ.

తెల్లవారింది ఎర్రని కుంకుమ ధరించిన ముత్తైదువులా ఉన్న ప్రాచీదిశను పరిశీలిస్తూ పడుకునుంది సీతాదేవి. అప్పుడే గూళ్ళనుండి బయటకు వెళ్తున్న పక్షుల రెక్కల చప్పుడు మంగళవాద్యాల్లా వీనుల విందుగా ఉన్నయ్. చల్లని ప్రాతఃకాలపు వాయువులు శరీరానికి, మనసుకు కూడా ఆహ్లాదాన్ని కలిగిస్తున్నయ్.

ఆ ఉదయం అన్ని ఉదయాల్లా ఎందుకో సామాన్యంగా లేదనిపించిందామెకు. ఇంతవరకు తన జీవితంలో ఎన్నడూ కలగని ఒక అపూర్వానుభూతిని తెచ్చిపెడ్తోందా ఉషోదయం.

నెమ్మదిగా లేచి కాలకృత్యాలు తీర్చుకున్నాక డైనింగ్‌రూమ్‌లోకి వెళ్ళింది కాఫీ కోసం. అందరూ మామూలుగా రోజూలానే ఎవరిస్థలాల్లో వాళ్ళు కూర్చున్నారు. కళ్యాణి మాత్రం లేదు. బహుశా నిన్నటి సంఘటన తరువాత తండ్రికి ముఖం చూపించటం యిష్టంలేక రాలేదేమో అనుకుంది.

'టిఫిన్ చల్లారిపోతోంది. కళ్యాణిని త్వరగా పిల్చుకురా!' అంటూ వంట మనిషితో చెప్పింది సీతాదేవి.

ఆమె వెళ్ళి ఐదునిమిషాల్లో తిరిగి వచ్చింది. కళ్యాణి ఆమె గదిలోను, బాత్‌రూమ్‌లోను, యింట్లో మరెక్కడా లేదని చెప్పింది.

అందరిలో అలజడి ప్రారంభమయింది.

రవి తన ముఖంలోని భావాలు పైకి కనపడనీయకుండా పేపరు ముఖాని కడ్డంపెట్టుకున్నాడు.

విజయ తండ్రి వంక బిత్తరచూపులు చూస్తూ చివరికి తల్లి భుజం పట్టుకుని ఏడుపుగొంతుకతో అంది 'అమ్మా! కళ్యాణక్క రాత్రి జార్జితోకలిసి విజయవాడ వెళ్ళిపోయిందమ్మా. వాళ్ళిద్దరూ వారం రోజులక్రితమే రిజిస్టర్ మారేజి చేసికున్నారట. రేపు చర్చిలోకూడా చేసికొంటారుట. తెల్లారేక నాతో చెప్పమని చెప్పింది అక్క!'

కూతురిమాటలు వింటూనే భరతశర్మ నిశ్చేష్టుడైనాడు.

భార్యా, పిల్లలవైపు వింతగా చూస్తూ నోటమాటలేకుండా కూర్చుండిపోయేడు.

సీతాదేవి మొదట ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరయింది. తరువాత విషయాలన్నీ క్రమంగా అర్థంచేసికొన్నాక పురివిప్పిన నెమలిలా ఆమె హృదయం నాట్యం చేయసాగింది.

తన ఆత్మకి ప్రతిబింబమయిన కళ్యాణికి పంజర ప్రాప్తి తప్పి, స్వేచ్ఛ లభించింటంతో సీతాదేవి తన జన్మసార్థకత పొందిన దనుకుంది.

ఆమె పెదవులపై చిరునవ్వు మెరిసింది.

ఆ నవ్వులో విజయగర్వం తొణికిసలాడుతోంది! ●